ఎక్కడి మురుగు అక్కడే!

నూజివీడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మురుగునీరు, చెత్త దర్శనమిస్తున్నాయి. రోడ్డు మార్జిన్లలో మురుగునీరు రోజుల తరబడి నిల్వ ఉంటోంది. ఇక ఖాళీ స్థలాల్లోకి వర్షంనీటితోపాటు ఇళ్లల్లో వాడిన నీరు చేరి తటాకాలను తలపిస్తున్నాయి. దుర్వాసనతోపాటు దోమలకు ఆవాసాలుగా ఇవి మారుతున్నాయి. దోమల దండయాత్రతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు.

- గ్రామాల్లో ముందుకు పారని మురుగు
- పడకేసిన పారిశుద్ధ్యం
- దోమల దండయాత్ర
- వ్యాధుల విజృంభణ


ముసునూరు మండలం కొర్లగుంట శివారు ఎస్‌పేటలో ఇళ్ల మధ్యలో నిల్వ ఉన్న మురుగునీరు

నూజివీడు: నియోజకవర్గంలో స్వచ్ఛతా హీ సేవ పేరుతో ప్రభుత్వం సెప్టెంబర్‌లో నిర్వహించిన కార్యక్రమం ప్రచారార్భాటానికి తప్ప కార్యక్రమంలో చిత్తశుద్ధి లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులతో సాధారణ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఏడాది మాత్రం వర్షాకాలం నుంచి నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలు జ్వరాల బారిన పడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. జలుబు, దగ్గు, గొంతు నొప్పి, జ్వరం, కీళ్ల నొప్పులు, డెంగీ లక్షణాలు ఎక్కువ మందిలో కనిపిస్తున్నాయి. గ్రామాల్లో అపరిశుభ్ర పరిస్థితులు, మురుగు కూపాలతో దోమలు, ఇతర క్రిమికీటకాలు ఎక్కువై ప్రజల ఆరోగ్యానికి హాని కలిగిస్తున్నాయి.

నిరుపయోగంగా సంపద సృష్టి కేంద్రాలు

ఏటా వర్షాకాలంలో ఇలా ప్రబలడం సాధారణమే అయినప్పటికీ ఈ ఏడాది మాత్రం ఎక్కువ కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి గ్రామంలో సంపద సృష్టి కేంద్రాలున్నప్పటికీ అవి నిరుపయోగంగా మారాయి. గ్రామాల్లోని చెత్తచెదారాన్ని సంపద సృష్టి కేంద్రాలకు తరలించేలా చర్యలు చేపట్టడంలో అధికార యంత్రాంగం విఫలమైంది. ఏ గ్రామంలో చూసినా రోడ్లు చెత్తచెదారంతోనే నిండి ఉంటున్నాయి. ఏ వీధి చూసినా మురుగునీటి గుంతలే దర్శనమిస్తున్నాయి. పంచాయతీ కార్యదర్శులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. గ్రామాల్లో రోడ్ల వెంబడి, ఖాళీ స్థలాల్లో వర్షం నీటితో పాటు గృహాల్లో వాడిన నీరు చేరి నెలల తరబడి నిల్వ ఉంటోంది. దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు వృద్ధి చెందుతున్నాయి. జ్వరాలు, అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో సమస్య మరింత జఠిలంగా మారుతోంది.


నూజివీడు మండలం సిద్ధార్థ నగర్‌లో రోడ్డు వెంబడి మురుగునీటి కాలువ ఇలా..

ప్రచారార్భాటంగా స్వచ్ఛతా హీ సేవ

రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబరు 17 నుంచి అక్టోబర్ 2 వరకు గ్రామగ్రామాన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించింది. దీనిలో భాగంగా ప్రతి గ్రామంలో పక్షం రోజుల పాటు పారిశుద్ధ్యంపై అనేక కార్యక్రమాలు జరిగాయి. అవగాహన ర్యాలీలు, తడిచెత్త, పొడిచెత్త సేకరణ, పరిశుభ్రంగా ఉంటే కలిగే లాభాలు తదితర అంశాలపై అధికారులతో పాటు అధికార పార్టీ నాయకులు పాల్గొని ఊకదంపుడు ఉపన్యాసాలు ఇచ్చారు. ఈ కార్యక్రమమంతా ప్రచారార్భాటం కోసం తప్పితే వాస్తవంగా కార్యాచరణకు నోచుకోలేదు. ఏ గ్రామంలో చూసినా మురుగునీటి గుంతలు తప్ప మరేమీ కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. రోడ్ల వెంబడి మురుగునీటి గుంతలు, ఖాళీ స్థలాలు మురికికూపాలుగా మారి దోమలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు.


ఆగిరిపల్లి మండలం వట్టిగుడిపాడులో రోడ్డుపైనే నిల్వ ఉన్న మురుగునీరు

దోమల ఉధృతి ఎక్కువైంది



గ్రామాల్లోని మురుగునీటి గుంతలతో దోమల ఉధృతి అధికంగా ఉండటంతో ప్రజలు వ్యాధుల బారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులు కనీసం మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు కూడా తీసుకోవడం లేదు. ఎవరికి వారు అందరూ ఇళ్లల్లో వాడిన మురుగునీటిని రోడ్లపైకి వదులుతున్నారు. దీనివల్ల అపరిశుభ్రత నెలకొంటోంది.
– పసుపులేటి రమేష్, వట్టిగుడిపాడు, ఆగిరిపల్లి మండలం

ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం



మురుగునీటి గుంతల తొలగింపుపై గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటాం. అలాగే ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటే గ్రామాల్లో చాలా వరకు మురుగు సమస్య తొలగుతుంది.
– చెన్నా రాఘవేంద్రనాథ్, ఎంపీడీఓ, నూజివీడు

క్లుప్తంగా

95 మందికి నేత్ర వైద్య పరీక్షలు



మైలవరం: అభ్యుదయ యువశక్తి సంఘం ఆధ్వర్యంలో కుదప గ్రామంలోని రైతు భరోసా కేంద్రం వద్ద ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. నేత్ర వైద్యులు పల్లెపాము లక్ష్మీకుమారి 95 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలన్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో 15 మందిని శస్త్రచికిత్స నిమిత్తం విజయవాడ చైతన్య కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. తండా గ్రామ పెద్దలు లావూరి గోపి, వడిత్య పోతిరెడ్డి, మూడు లక్ష్మణరావు, మూడు కండియా, వడిత్య రాంబాబు, బాలాజీ, అభ్యుదయ యువశక్తి సంఘం అధ్యక్షుడు చింతిరాల వెంకటేశ్వరరావు, సిరి ఆప్టికల్స్ యజమాని వెంపాటి సురేష్, మోదుగు దావీదు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆదివారం స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో పంపిణీ చేశారు. 26 మంది లబ్ధిదారులకు రూ.18 లక్షల 74 వేల 379 విలువైన చెక్కులను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అందజేశారు.

రైతు బజారు పరిశీలన..
తిరువూరు రైతు బజారు సమీపంలోని చీరాల సెంటర్‌లో తోపుడు బండ్లను ఇష్టానుసారం ఏర్పాటు చేయవద్దని ఎమ్మెల్యే శ్రీనివాసరావు సూచించారు. చీరాల సెంటర్‌లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉన్నందున దుకాణదారులకు, వాహన చోదకులకు అసౌకర్యం కలుగకుండా నిర్దేశిత స్థలాల్లోనే తోపుడు బండ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

బీఎల్‌ఓలకు సూచనలు



ముసునూరు: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా బీఎల్‌ఓలు యుద్ధ ప్రాతికన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కె. రాజ్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని వేల్పుచర్లలోని 103, 104, 105, 106, చిల్లబోయినపల్లిలోని 107, 108 నంబరు పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఓటర్ల నమోదు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి పలు సూచనలు చేశారు.

మాలలు సంఘటితం కావాలి



ఆగిరిపల్లి: మాలలు సంఘటితమై హక్కులు సాధించుకుందామని ఏలూరు జిల్లా దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు జోజి బాబు అన్నారు. ఆగిరిపల్లిలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఆదివారం నూజివీడులో జరిగిన మాలల ఆత్మగౌరవ సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి జోజి బాబు ఆధ్వర్యంలో మాల మహానాడు కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు.

పందుల స్వైరవిహారం



ఆగిరిపల్లి: ఆగిరిపల్లిలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. పందులను ఊరికి దూరంగా పెంచాలని నిబంధన ఉన్నప్పటికీ పెంపకందారులు గ్రామంలోనే వదిలేస్తున్నారు. పంచాయతీ సిబ్బంది చెత్తను పూర్తి స్థాయిలో తరలించకపోవడంతో పందులు చెల్లాచెదురు చేయడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు, నాయకులు స్పందించి పందులను వీధుల్లో సంచరించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

మైలవరం: రెడ్డిగూడెం మండలం ఓబులాపురం గ్రామంలో సహస్ర ధన్వంతరి ఆయుర్వేద వైద్య శిబిరం శనివారం నిర్వహించారు. డాక్టర్ సాయి శ్రీనివాసరెడ్డి రోగులను పరీక్షించి మందులు అందజేశారు. రోగులకు ఆరోగ్యానికి సంబంధించి పలు సూచనలు చేశారు.

డీ పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా జమలయ్య



గంపలగూడెం: డీ పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల తెలుగు స్కూల్ అసిస్టెంట్ బూరుగు జమలయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని డీ పీఆర్టీయూ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఈ ఎంపిక జరిగింది. జమలయ్యకు నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షుడు డి. శ్రీను అందజేశారు. జమలయ్య గతంలో డీ పీఆర్టీయూ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించారు. జమలయ్య అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై మండలంలోని పలువురు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తంచేశారు.

ప్రత్యేక శిబిరాల పరిశీలన



విస్సన్నపేట: ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ–2025లో భాగంగా ఆదివారం మండలంలోని అన్ని గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. పుట్రేల, కొండపర్వ, విస్సన్నపేట గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాలను తహసీల్దార్ లక్ష్మీకల్యాణి పరిశీలించి పలు సూచనలు చేశారు.

నేడు ఉపాధి గ్రామ సభలు

గంపలగూడెం: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేపట్టనున్న పనులను ఎంపిక చేసేందుకు మండలంలోని ఎనిమిది గ్రామాల్లో సోమవారం గ్రామ సభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ చెన్నయ్య, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ వెంకటేశ్వరరావు తెలిపారు. అమ్మిరెడ్డిగూడెం, దుందిరాలపాడు, కనుమూరు, గంపలగూడెం, కొణిజెర్ల, నెమలి, ఉమ్మడ దేవరపల్లి, ఊటుకూరు గ్రామాల్లోని గ్రామ సచివాలయాల వద్ద గ్రామ సభలు జరుగుతాయని చెప్పారు. రైతులు, గ్రామస్తులు ఆయా గ్రామ సభల్లో పాల్గొని అవసరమున్న పనులను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అన్ని సామాజిక వర్గాలు అభివృద్ధి సాధించాలి

మంత్రి కొలుసు పార్థసారథి

నూజివీడు: సమాజంలో అన్ని సామాజిక వర్గాల వారు కలిసిమెలిసి ఒకరికొకరు సాయం చేసుకుంటూ ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులో శ్రీ భద్రావతి సమేత భావన ఋషి పద్మశాలియ సంక్షేమ సంఘం కార్తిక వనసమారాధన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పిల్లలను చదివించాలని, ఉన్నత చదువులు చదివి జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. అనంతరం అండర్ 13 చెస్ పోటీల్లో గత ఐదేళ్ల నుంచి జాతీయ అవార్డు సాధిస్తున్న కె.భావన్‌ను సన్మానించి రూ. లక్ష ఆర్థిక సాయాన్ని అందించారు. అనంతరం మంత్రిని పద్మశాలి సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. అలాగే పట్టణంలో ఆదివారం నిర్వహించిన యాదవ సంఘం వన సమారాధనలో మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్యఅతిథిగా పాల్గొని సామాజిక అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు.


వన సమారాధనలో గంపలగూడెం హైస్కూల్ పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల వన సమారాధన
గంపలగూడెం: గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం కార్తిక వన సమారాధనలో పాల్గొన్నారు. పాఠశాలలో 1986–87లో పదో తరగతి చదివిన విద్యార్థులు వన సమారాధన నిర్వహించారు. రోజంతా మామిడి తోటలో ఆహ్లాదకర వాతావరణంలో గడిపారు. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు చేశారు.

కాపుల వన సమారాధన..
ఊటుకూరు(గంపలగూడె): ఊటుకూరులో కాపు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన సమారాధన నిర్వహించారు. కల్లూరు రోడ్డులోని డీఎస్‌ఆర్ మామిడి తోటలో నిర్వహించిన కార్యక్రమంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం, ఉసిరి చెట్టుకు పూజలు జరిగాయి. మధ్యాహ్నం సహపంక్తి భోజనాలు నిర్వహించారు.

మండలానికి ఒక షాపింగ్ కాంప్లెక్ నిర్మించాలి

ఏపీ చర్మకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజారావు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మాదిగల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి మండల కేంద్రంలో చెప్పుల షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని ఆంధ్రప్రదేశ్ చర్మకార సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బుల్లా రాజారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొండపల్లిలో ఎస్సీ, ఎస్టీ జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ నియోజకవర్గ స్థాయి సమావేశం ఆదివారం నిర్వహించారు. కమిటీ సభ్యుడు బట్టపర్తి రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజారావు మాట్లాడుతూ జి.కొండూరు మండలం వెల్లటూరులో లెదర్‌పార్క్ నిర్మించి అర్హులైన చర్మ, డప్పు కళాకారులకు రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం చేయాలన్నారు. లిడ్‌క్యాప్‌లో 300 మందికి ఉద్యోగాలు కల్పించి తక్షణం రూ.300 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బుల్లా రాజారావును సత్కరించారు. చర్మకార సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జి.వెంకటేశ్వరరావు, ఎన్.ఏసోబు, విజిలెన్స్ కమిటీ సభ్యులు రాంబాబు, రాజశేఖర్, జోసఫ్, పుల్లారావు పాల్గొన్నారు.


రాజారావును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

● పట్టు తప్పితే.. బతుకు బోల్తానే !

ఆటోల్లో నిబంధనలకు విరుద్ధంగా సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. ప్రమాదకర ప్రయాణాలు వద్దని ఎంత చెబుతున్నా కొందరు పెడచెవిన పెట్టి ప్రయాణిస్తూనే ఉన్నారు. మహిళలు కూలి పనులకు వెళ్లి వస్తూ డ్రైవర్‌కు ఇరువైపులా, ఆటో లోపలి భాగంలో కూర్చోవడంతో పాటు వెనుక డోర్‌పైన ప్రమాదకరంగా కూర్చుని ప్రయాణిస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర ప్రయాణాలను నియంత్రించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.
–నూజివీడు



ముసునూరులో శాంతి ర్యాలీ


మానవహారం నిర్మించిన ఆర్‌సీఎం ప్రతినిధులు, యువకులు

ముసునూరు: భారత దేశంలో శాంతి వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ యువత ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌సీఎం చర్చి నుంచి మండపం సెంటర్ వరకు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. మండపం సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. తొలుత ఆర్‌సీఎం చర్చి ప్రాంగణంలో ప్రముఖ వక్త, ఏపీఎస్‌ఎస్‌ఎస్ డైరెక్టర్ డి.అబ్రహం వివిధ గ్రామాల నుంచి హాజరైన 110 మంది యువతకు సామాజిక స్పృహ, నైపుణ్యాలు, నైతిక విలువలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ముసునూరు ఆర్‌సీఎం విచారణకర్త రెవ.ఫాదర్ జోసెఫ్ తంబి, సహాయక ఫాదర్లు ఇలవర్సన్, నోవిస్ మాస్టర్ జోయ్ అమల్, క్లారెట్ ఫాదర్ నిర్మల్ కుమార్, ప్రేరణాలయ సిస్టర్లు సుధారాణి, జాన్సల్, వినీల పాల్గొన్నారు.

బాలికల గురుకులం ఆకస్మిక తనిఖీ

ముసునూరు: గురుకుల విద్యార్థినులకు మంచి ఆశయాలు, లక్ష్యాలు, నడవడిక అలవర్చి, వాటిని నెరవేర్చుకునే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సొసైటీ కార్యదర్శి, సీమాట్ (ఎస్ఐఈఎంఏటీ) స్టేట్ డైరెక్టర్ వీఎన్ మస్తానయ్య ఆదేశించారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో ఆయన ఆకస్మిక తనిఖీలు చేశారు. ముందుగా పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న వసతి, సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలకు కావాల్సిన వసతి, మౌలిక సదుపాయాలు, పీఎం శ్రీ నిర్మాణ పనులు, కాంపౌండ్ వాల్ నిర్మాణ వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజన పదార్థాల నాణ్యతను పరిశీలించి రుచికరంగా వండి విద్యార్థులకు వడ్డించాలని ప్రిన్సిపాల్ కొండాబత్తుల ప్రవీణను ఆదేశించారు.

నేడు 'మీకోసం'

నూజివీడు: స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం) కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీఓ మోవిడి వాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందించవచ్చన్నారు.

ఆర్యవైశ్య సమాజం నూతన కార్యవర్గం ఎన్నిక

తిరువూరు: తిరువూరు ఆర్య వైశ్య సమాజం అధ్యక్షుడిగా గుడిమెట్ల మురళి ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో మురళి 540 ఓట్ల మెజారిటీతో మాల్యాద్రిపై గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా దారా ఉపేంద్ర, కార్యదర్శిగా దొడ్డా వీఎంఎస్‌కేఎస్ గుప్తా, కోశాధికారిగా జూలూరు వెంకట రమణయ్య, సంయుక్త కార్యదర్శిగా చిత్తలూరి నరసింహరాజు, కార్యవర్గ సభ్యులుగా నాగబండి మహీధర్, బండారు శ్రీనివాసరావు, గుడిమెట్ల జగన్, కట్టమూడి సోమశేఖర్ ఎన్నికయ్యారు.


నూతన అధ్యక్షుడు మురళి, కార్యవర్గ సభ్యులు

చనుబండ ఏరియా ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడిగా వేణు

చాట్రాయి: చనుబండ ఏరియా ఎలక్ట్రికల్ యూనియన్ అధ్యక్షుడిగా చిట్టెం వేణు ఎన్నికయ్యారు. ఆదివారం మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామంలో యూనియన్ ఆధ్వర్యంలో కార్తిక వన సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా చనుబండ ఏరియా భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం అధ్యక్షుడు తీర్థాల అద్భుతరావు సమక్షంలో యూనియన్ సభ్యులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా మిద్దె అంజి, కార్యదర్శిగా గంజిబోయిన శ్రీరామ్, జాయింట్ సెక్రటరీగా బి.నరసింహారావు, ట్రెజరర్‌గా పల్లె పోగు వినయ్ తదితరులను ఎన్నుకున్నారు.

రేపు రామలింగేశ్వరాలయం వార్షికోత్సవం

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం అభయాంజనేయస్వామి సహిత రామలింగేశ్వర స్వామి ఆలయం 16వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త బోడేపూడి అప్పారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామివార్లకు విశేష పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

వణికిస్తున్న వీధి కుక్కలు

మైలవరం: జి. కొండూరు గ్రామంలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. రోడ్లపై గుంపులుగుంపులుగా తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయి. గ్రామస్తులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. రోడ్లపై నడిచి వెళుతున్న మహిళలు, చిన్నారులు, వృద్ధులపై దాడి చేస్తున్నాయి. వాహన చోదకుల వెంటపడి కరుస్తున్నాయి. శుక్రవారం వీధి కుక్కలు ఒక బాలునిపై దాడి చేశాయి. పినపాక రోడ్డులో నివాసం ఉంటున్న గుర్రం చరణ్ సాయి వెంకట్ (8) వీధి కుక్కల దాడిలో గాయపడ్డాడు. వీధి కుక్కలు విచక్షణా రహితంగా కరిచాయని బాలుని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించి వీధి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

12 మంది జూదరుల అరెస్ట్

తిరువూరు: స్థానిక కోకిలంపాడు రోడ్డులోని మామిడితోటలో ఆదివారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. వన సమారాధన పేరుతో జూదాలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ సిబ్బందితో కలిసి దాడి చేశారు. 12 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.15,100 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పెట్రోల్ బంకులో మోసంపై ఫిర్యాదు

తిరువూరు: స్థానిక బైపాస్ రోడ్డులోని ఒక పెట్రోల్ బంకులో పెట్రోల్, డీజిల్ కొలతల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని వినియోగదారులు ఆదివారం తిరువూరు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. లీటరు పెట్రోల్‌కు 200 గ్రాముల చొప్పున తక్కువగా వాహనాలకు పోస్తుండటంతో వినియోగదారులు నష్టపోతున్నారని, బంకు నిర్వాహకులను అడిగినా నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని బాధితులు వాపోయారు. సగటున రోజుకు 3 వేల లీటర్లకు పైగా కొలతల్లో మోసాలకు పాల్పడుతున్న బంకు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కోడి పందేల శిబిరంపై దాడి
పందెంరాయుళ్ల అరెస్ట్

మైలవరం: కోడి పందేల శిబిరంపై దాడి చేసి రెండు కోడి పుంజులు, ఎనిమిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నామని సీఐ దాడి చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. మైలవరం మండలం చంద్రగూడెం గ్రామంలో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేశామని చెప్పారు. నిందితుల నుంచి రూ.3.570 స్వాధీనం చేసుకున్నామన్నారు.

- ఆగిరిపల్లి: మండలంలోని కనసానపల్లి శివారులో కోడిపందేల స్థావరంపై ఆదివారం ఎస్ఐ శుభశేఖర్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. కోడి పందేలు వేస్తున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7,100 నగదును, 10 ద్విచక్ర వాహనాలు, రెండు కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.
- విస్సన్నపేట: మండలంలోని కొర్లమండ పంచాయతీ మోతేరావుపేట శివారులో పేకాట శిబిరంపై దాడి చేసి 10 మందిని అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ రామకృష్ణ ఆదివారం తెలిపారు. జూదరుల నుంచి రూ.17,510, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గ్రామాల్లో జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

